సాక్షి చిత్తూరు
మంగళవారం । 31 । అక్టోబర్ । 2023



ఎర్ర స్మగ్లర్ల సరికొత్త దారి

స్మగ్లర్లు ఎప్పటికప్పుడు సరికొత్త మార్గాలను ఎంచుకుని ఎర్రచందనం దుంగలను కర్ణాటకకు తరలిస్తున్నారు. - IIలో



వరి పంటపై ఏనుగుల దాడి

అటవీ సమీప గ్రామాల్లో వరి పంటపై ఏనుగులు దాడి చేసి, నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. - IIలో



తీరంలో చలిగాలులు

తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలోని సముద్రతీర ప్రాంతంలో రెండు రోజులుగా చలిగాలులు వీస్తున్నాయి. - IIలో

పేదల ఆరోగ్యానికి కొండంత అండ

రాష్ట్ర ప్రభుత్వం ఖరీదైన వైద్యాన్ని పేదలకు ఉచితం చేసింది. నగరాలకే పరిమితమైన వైద్య సేవలను పల్లె ముంగిట్లోకి తీసుకొచ్చింది. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గ్రామీణుల ఇంటికే వైద్యులను పంపిస్తోంది. గడప దాటకుండా వైద్య పరీక్షలు చేసి పేదల బాగోగులను చూసుకుంటోంది. అత్యవసర వైద్యానికి క్షణాల్లో ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు కావాల్సిన సౌకర్యాలను కల్పిస్తోంది. ఆరోగ్య కేంద్రాలు 24 గంటలు పనిచేసేలా మార్గదర్శకాలు ఇచ్చింది. దీంతో వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు పరుగులు తీయాల్సిన కష్టం తప్పింది. ప్రభుత్వ పనితీరు పేదలకు కొండంత భరోసానిస్తోంది. దీనిపై కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే చేపట్టింది. నెలరోజుల నుంచి సాగుతున్న సర్వే మంగళవారంతో ముగియనుంది.

- పక్కాగా జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే
- జిల్లాలోని 15 గ్రామాల్లో సర్వే పూర్తి
- నేటితో ముగియనున్న ప్రక్రియ



జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో అధికారులు, సిబ్బంది

చిత్తూరు రూరల్: జిల్లాలో వైద్య సేవలు మారుమూల గ్రామాల్లోని పేదలకు అందుతున్నాయి. ఏ ప్రభుత్వం చేయలేనన్ని వైద్య ఆరోగ్య సేవలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. జిల్లాలో ఒక జిల్లా ఆస్పత్రి, 4 ఏరియా ఆస్పత్రులు, 7 సీహెచ్‌సీలు, 50 పీహెచ్‌సీలు, 14 అర్బన్ హెల్త్ సెంటర్లు పనిచేస్తున్నాయి. అధిక శాతం మంది ప్రజలు ఈ ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందుతున్నారు. ఈ సేవలను మరింత మెరుగ్గా అందించాలన్నే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల కిందట వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను పల్లె ముగింటకు తీసుకొచ్చింది. ఈ క్లినిక్‌లు జిల్లాలో 464 వరకు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి నెలా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేసి వైద్యసేవలను అందిస్తోంది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేసి గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తోంది. గర్భిణులకు సకాలంలో సత్వర వైద్య సేవలను అందిస్తోంది. తల్లీబిడ్డ సంరక్షణకు విశేషంగా కృషి చేస్తోంది. మాతాశిశుమరణాల కట్టడే లక్ష్యంగా పనిచేస్తోంది. ఇందుకు గాను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటోంది. మరోవైపు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేస్తోంది. సకాలంలో ప్రసవం జరిగేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 24 గంటలు పనిచేసేలా చర్యలు చేపట్టింది. ఆరోగ్య ఆసరాతో పేదలకు కొండంత అండగా నిలబడుతోంది. ఈ సేవల్లో నిర్లక్ష్యం కనిపిస్తే వెంటనే దిద్దుబాటు చర్యలకు దిగుతోంది. దీనిపై కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే చేపడుతున్నాయి.

15 గ్రామాల్లో సర్వే

జిల్లాలోని 24 మంది వైద్య అధికారులు, సిబ్బందికి సర్వేపై విజయవాడలో శిక్షణ ఇచ్చారు. ఆ తర్వాత వీరు ఒక బృందంగా వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న వైద్య ఆరోగ్య సేవలపై ఎంపిక చేసిన 15 గ్రామాల్లో అవగాహన కల్పించారు. సర్వే విధి విధానాలపై తెలియజేశారు. దీంతో పాటు కేంద్ర బృంద అధికారులు 8 మంది చొప్పున రెండు బృందాలుగా ఏర్పడి సర్వేను ప్రారంభించారు. జిల్లాలో సెప్టెంబర్ 18వతేదీన సర్వే ప్రారంభమైంది. ఎంపిక చేసిన గ్రామాల్లో, ఒక్కో గ్రామానికి 22 కుటుంబాలను మ్యాపింగ్ చేశారు. ఇలా ఇప్పటి వరకు 14 గ్రామాల్లో సర్వే పూర్తయింది. ప్రస్తుతం బంగారుపాళ్యం మండలం తుంబకుప్పం పీహెచ్‌సీ పరిధిలో సర్వే కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రంతో సర్వే పూర్తికానుంది.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం



రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ముందుకు వెళుతోంది. ప్రతి కార్యక్రమాన్ని పక్కాగా పర్యవేక్షిస్తోంది. వాటిలోని లోపాలను సరిదిద్దేందుకు వెంటనే తగు చర్యలు తీసుకుంటోంది. ప్రధానంగా మాతా, శిశుమరణాలను కట్టడి చేయాలని ప్రయత్నిస్తోంది. ఆ దిశగానే మేమందరం పనిచేస్తున్నాం. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాల పనితీరును తెలుసుకోవడానికే ఈ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే జరుగుతోంది.

– ప్రభావతిదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, చిత్తూరు

సర్వే ఇలా ...



కేంద్ర బృంద అధికారులు పకడ్బందీగా సర్వే చేపడుతున్నారు. ఆశావర్కర్, ఏఎన్‌ఎం, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ల సాయంతో ప్రతి ఇంటికీ వెళ్లి 1,030 ప్రశ్నలు అడిగి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఒక్కో కుటుంబం సర్వే చేసేందుకు 2 గంటల సమయం కేటాయిస్తున్నారు. ఇలా ప్రతి గ్రామంలో మూడు రోజులపాటు గడుపుతున్నారు. అక్కడ ఆరోగ్య సేవలు అందుతున్నాయా, ఆరోగ్యశ్రీ, అభయా కార్డులు, ఆరోగ్య శ్రీ లబ్ధి, బీమా సౌకర్యంతో ప్రైవేటు వైద్య సేవలు, కాన్పు సమయంలో 108 సేవలు, ప్రైవేటు వాహనాల్లో ప్రసవానికి వెళితే ఖర్చులు, క్షేత్రస్థాయి సిబ్బంది సేవల పనితీరుపై ఆరాతీస్తున్నారు. మాతా, శిశు మరణాలు, వ్యాధి నిరోధక టీకాల అమలు, గర్భిణుల సేవలు, పౌష్టికాహారం పంపిణీ తదితర సేవలపై వివరాలను సేకరిస్తున్నారు. వివిధ రకాల వ్యాధులు, వాటి వ్యాప్తిపై అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లో సేకరించిన వైద్య ఆరోగ్య వివరాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదికల రూపంలో ఇవ్వనున్నారని జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు వెల్లడిస్తున్నారు. కేంద్ర బృందం అడిగిన ప్రశ్నలకు ఓపికగా ప్రతి కుటుంబం నుంచి సమాధానం లభిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య సేవలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తూ వివరాలను వెల్లడిస్తున్నారు. పల్లెలకు డాక్టర్లు వస్తున్నారని, లేవలేని స్థితిలో ఉంటే డాక్టరే ఇంటి కొచ్చి సేవలు అందిస్తున్నారని వివరిస్తున్నారు.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన డిప్యూటీ కలెక్టర్లు





కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డిప్యూటీ కలెక్టర్లు శివయ్య, రాఘవేంద్ర

చిత్తూరు కలెక్టరేట్ : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లు సోమవారం కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కలెక్టరేట్‌లోని విపత్తు నిర్వహణ విభాగం (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) డిప్యూటీ కలెక్టర్ శివయ్య, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–1 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర సోమవారం కలెక్టర్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. విధుల్లో చేరిన ఆ అధికారులు చేపట్టాల్సిన విధుల పట్ల కలెక్టర్ పలు సూచనలు చేశారు. అనంతరం వారు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులును కలిశారు.

1 నుంచి విద్యుత్ తనిఖీలు

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ చౌర్యంపై నవంబరు 1 నుంచి జిల్లాలో తనిఖీలు చేయనున్నట్లు ట్రాన్స్‌కో డీపీఈ డిస్కం ఎస్‌ఈ శ్రీనివాస్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ ఫీడర్ల నుంచి సరఫరా అవుతున్న విద్యుత్‌కూ, వాడకం నమోదుకూ మధ్య తేడా ఉన్నట్లు గుర్తించామన్నారు. దీంతో విద్యుత్ వృథా అవడంతో సంస్థకు నష్టం వస్తోందన్నారు. దీన్ని నివారించడానికి జిల్లాలోని పది ప్రాంతాలను ఎంపిక చేసుకొని అక్కడ తనిఖీలు చేస్తామన్నారు. విద్యుత్ ఎక్కడ వృథా అవుతోంది, అందుకు గల కారణాలు తెలుసుకొని వాటిని నివారించడానికి కృషి చేస్తామని వివరించారు.

ఉచితంగా కృత్రిమ చేతుల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్ : దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ చేతులు పంపిణీ చేయనున్నట్లు జిల్లా దివ్యాంగుల శాఖ ఏడీ శ్రీనివాస్ వెల్లడించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఎల్లెన్ మెడోస్ ప్రోస్టటిక్ హ్యాండ్ ఫౌండేషన్ సహకారంతో డిసెంబర్ 10వ తేదీన గుంటూరు జిల్లాలోని మంగళగిరిలో క్యాంపు నిర్వహిస్తారన్నారు. ఆ క్యాంప్‌లో రోటరీ క్లబ్ వారి ఆధ్వర్యంలో అధునాతనమైన, సులభంగా ధరించగలిగిన కృత్రిమ చేతులను ఉచితంగా అందజేస్తారన్నారు. మో చేయి కింద కనీసం 4 అంగుళముల చేయిగల దివ్యాంగులు కృత్రిమ చేతులు పొందడానికి అర్హులన్నారు. ఉచితంగా అందజేసే కృత్రిమ చేతుల విలువ రూ.36,000 ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆసక్తి ఉన్న దివ్యాంగులు 7207403150ను సంప్రదించాలని ఏడీ కోరారు.

వరసిద్ధుని అంతరాలయానికి రాగి తొడుగులు



రాగి రేకులను పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్, ఈఓ, దాత, అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి అంతరాలయానికి రాగి తొడుగులు అమర్చనున్నారు. ఈ రాగి రేకులను ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, దాతలు గోటిపాటి రామకృష్ణ సోమవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ స్వామివారి అంతరాలయానికి రాగి రేకులు తొడిగి వాటికి బంగారు తాపడం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఈ వెంకటనారాయణ, మాజీ సీఎఫ్ఓ నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

పాలక మండలి సభ్యుడి ప్రమాణం



ప్రమాణం చేస్తున్న సభ్యుడు గోపి

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పాలక మండలి సభ్యులుగా గోపి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. నూతన పాలక మండలి సభ్యులుగా బెంగళూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త గోపి నియమితులయ్యారు. ఆయన ఉదయం ఆలయ సమావేశపు మందిరంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన్ను ఆలయ అధికారులు సత్కరించారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలు సకాలంలో పూర్తి చేయండి

- జలజీవన్ లక్ష్యం సాధించాలి
- సమీక్షలో కలెక్టర్ షణ్మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో ఆయా శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, రైతు భరోసా, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల పనులు నవంబర్ 5వ తేదీ లోపు పూర్తి చేసి ఆయా శాఖలకు అప్పగించాలని సూచించారు. గ్రామ సచివాలయాలు 45, రైతు భరోసా కేంద్రాలు 37, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు 44 భవనాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 99 గ్రామాల్లో స్వామిత్వ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో గ్రౌండ్ ట్రూథింగ్ 46 గ్రామాల్లో పూర్తి కాగా, 53 గ్రామాల్లో సర్వే జరుగుతోందని చెప్పారు. గ్రౌండ్ వ్యాలిడేషన్ 33 గ్రామాల్లో పూర్తి చేయగా, 30 గ్రామాల్లో నోటిఫికేషన్–13 ఇచ్చినట్లు తెలిపారు. 25 గ్రామాల్లో ఫైనల్ ఆర్‌వోఆర్‌ను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జలజీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ కొళాయి కనెక్షన్‌లు ఈ ఏడాదిలో 15,709 ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు 2,984 ఇచ్చినట్లు చెప్పారు. మిగిలిన కనెక్షన్‌లు డిసెంబర్ 31వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పీఆర్‌ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీపీవో లక్ష్మీ, డ్వామా పీడీ గంగాభవాని పాల్గొన్నారు.

స్పందన అర్జీలను బాధ్యతగా పరిష్కరించండి

స్పందనలో నమోదయ్యే అర్జీలు ఆయా శాఖల అధికారులు బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో నమోదయ్యే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని చెప్పారు. స్పందనలో 347 అర్జీలు నమోదైనట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

- నేడు జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించాలి : జాయింట్ కలెక్టర్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : స్పందన, జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారంలో మండల స్థాయి కో–ఆర్డినేషన్ కమిటీలు మరింత చొరవ తీసుకుని పనిచేయాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఇరువర్గాలతో మాట్లాడి భూ సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. 48 గంటల్లోపు సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. భారత ప్రథమ హోం శాఖా మంత్రి సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 31 న జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించాలని ఆదేశించారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం జిల్లాలో మొదటి, రెండో విడతల్లో పనులు పూర్తయ్యాయని చెప్పారు. మూడో విడత పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పూర్తయిన పనుల వివరాలను సంబంధిత యాప్‌లో అప్లోడ్ చేయాలని పేర్కొన్నారు. సంక్షేమ వసతి గృహాలను జిల్లా, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లు తనిఖీ చేసి నాన్ అకడమిక్ అంశాల చెక్‌లిస్ట్ నివేదికలను పంపాలన్నారు. ఓటీఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఆదేశించారు. మైన్స్, జువాలజీ– 104, ట్రాన్స్‌కో– 136 మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్– 129 (బర్త్ సర్టిఫికెట్స్) సివిల్ సప్లై– 63 పోలీసు– 55 పెండింగ్ దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని చెప్పారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, పలు శాఖల అధికారులు ఉమామహేశ్వర్‌రెడ్డి, రాజ్యలక్ష్మీ, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుపతి ఎడ్యుకేషన్: జాతీయస్థాయిలో జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరంలో 9, 11వ తరగతుల్లో ప్రవేశ పరీక్షలకు దరఖాస్తుకు చివరి గడువు నవంబర్ 7 వరకు ఉంటుందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ యస్.విశ్వనాథ్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలియచేశారు. 9వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని, 11వ తరగతికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2009 మే 1 నుంచి 2011 జూలై 31 మధ్య జన్మించిన వారై ఉండాలని, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2007 జూన్ 1 నుండి 2009 జూలై 31 మధ్యన జన్మించిన వారై ఉండాలని తెలిపారు. పరీక్ష తేదీ 10 ఫిబ్రవరి 2024న ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాల కోసం 8688888802, 9399976999ను సంప్రదించాలని కోరారు.

రూ.5 కోట్లతో బోయకొండ అభివృద్ధి



వివరాలు వెల్లడిస్తున్న చైర్మన్ నాగరాజ రెడ్డి, పక్కన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

చౌడేపల్లె : పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద రూ.5 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు పాలక మండలి తీర్మానించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజరెడ్డి తెలిపారు. ఆలయ కార్యాలయంలో సోమవారం పాలక మండలి తొలిసమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి హాజరయ్యారు. చైర్మన్ మాట్లాడుతూ బోయకొండలో ప్రతి శుక్రవారం 200 మందికి అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. ప్రతి నెలా రూ.2 లక్షల విద్యుత్ బిల్లులు ఆదా చేయడానికి రూ.2 కోట్లతో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఆమోదించారు. సిమెంటు రోడ్లు ఏర్పాటు, ఫంక్షన్ హాల్, అన్ని వసతులు కల్గిన విశ్రాంత భవనాలతోపాటు పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి తీర్మానించారు. మాస్టర్ ప్లాన్‌లో పొందుపర్చిన మేరకు అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకొంటున్నట్లు చైర్మన్ వెల్లడించారు. భక్తుల సౌకర్యాలు, సేవా కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఈఓ చంద్రమౌళి, పాలక మండలి సభ్యులు రాజేష్, రజిని, రాందాస్, పవన్‌కుమార్, భారతి, బుద్ధమ్మ, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీదేవి, హైమావతి, రెడ్డెమ్మ, ఎక్స్ అఫిషియో సభ్యుడు గంగిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం



శిబిరాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ నాగేశ్వరరావు

చిత్తూరు అర్బన్: విధి నిర్వహణలో ప్రాణాలు పోగొట్టుకున్న పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ విద్యార్థులు రక్తదానం చేశారు. పోలీసు అమర వీరుల దినోత్సవంలో భాగంగా సోమవారం చిత్తూరులోని మిట్టూరులో ఉన్న పోలీసు క్వార్టర్స్ ఆవరణలో కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. ఆర్మ్డు రిజర్వు ఏఎస్పీ నాగేశ్వరరావు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. పలువురు విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. స్వీకరించిన రక్తాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి అందజేశారు. ఏఆర్ డీఎస్పీ మురళీధర్, ఆర్‌ఐలు నీలకంఠేశ్వరరెడ్డి, మధు, పలువురు సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌ల తనిఖీ



పీసీఆర్ పాఠశాలలో ల్యాబ్‌ను తనిఖీ చేస్తున్న జాకీర్ హుస్సేన్

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ టీం సభ్యుడు జాకీర్ హుస్సేన్ సోమవారం పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లను పరిశీలించారు. జిల్లాలో వ్యాప్తంగా పలు మండలాల్లో ఉన్న సైన్స్ ల్యాబ్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాల, మిట్టూరులోని విజయం పాఠశాల, ఆర్‌కే మోడల్ పాఠశాల, సంజయ్‌గాంధీనగర్‌లోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్, జీడీ నెల్లూరులోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్, పూతలపట్టులోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్, నగరిలోని ఎస్‌జీఎస్ జెడ్పీ బాలికల పాఠశాల, బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. ఆ పాఠశాలల్లో విద్యార్థులకు సైన్స్ ల్యాబ్‌లు, అందులో ప్రయోగాల తరగతులు, విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. మరో రెండు రోజులపాటు ఆయన మరిన్ని మండలాల్లో పర్యటించనున్నారు. అనంతరం నివేదికలను రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు అందజేస్తారని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

ప్రాచీన కళలకు ప్రాణం పోద్దాం

- కేంద్ర సంగీత, నాటక అకాడమీ సభ్యురాలు భారతి
- కుప్పం మండలంలో పర్యటన
- పురాతన కళలు, ద్రౌపదీ ఉత్సవాలపై ఆరా



కొత్తయిండ్లులో కళాకారులతో సమావేశమైన భారతి

కుప్పంరూరల్: మసక బారుతున్న ప్రాచీన కళలకు ప్రాణం పోసేందుకు అందరం కలసికట్టుగా కృషిచేద్దాం అని కేంద్ర సంగీత, నాటక అకాడమీ సభ్యురాలు ఎస్.పి.భారతి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కొత్తయిండ్లు గ్రామంలో సోమవారం పర్యటించిన ఆమె స్థానిక కళాకారులతో సమావేశమయ్యారు. స్థానికంగా ఉన్న పురాతన కళలు, ద్రౌపదీ ఉత్సవాల గురించి అడిగి తెలుసుకున్నారు. కూచిపూడి, నాటకాలు, హరికథలు వంటి కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. అందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందో కళాకారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భారతి మాట్లాడుతూ టెలివిజన్లు, ఫోన్లు వచ్చిన తరువాత కళలకు ప్రాధాన్యత తగ్గిందని, రానురాను కనుమరుగయ్యే పరిస్థితి ఎదురవుతోందని చెప్పారు. కుప్పం ప్రాంతంలో నిర్వహించే ద్రౌపదీ ఉత్సవాలు చాలా ప్రసిద్ధి చెందాయని, వీటి గురించి తెలుసుకునేందుకే వచ్చినట్లు చెప్పారు. ఈ ద్రౌపదీ ఉత్సవాల గుర్తింపు కోసం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తున్నట్లు ఆమె చెప్పారు. అదే విధంగా ప్రాచీన కళలకు ప్రాణం పోసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. కొత్తయిండ్లులో ఉన్న శ్రీ కృష్ణ దేవరాయ నాటక సమాజానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సుదర్శనం, నాటక సమాజ సభ్యులు ఉన్నారు.

ఘర్షణలో ఇద్దరికి తీవ్రగాయాలు

గంగాధర నెల్లూరు: పాత కక్షల నేపథ్యంలో ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకోవడంతో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన మండల పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, మండలంలోని ముక్కళతూరు గ్రామ పంచాయతీ నాశంపల్లి దళితవాడకు చెందిన అబూ వర్గీయులు, వేణు వర్గీయులు తమ డిమాండ్ల పరిష్కార విషయమై ముందుగా గ్రామపెద్దల వద్ద పంచాయితీ పెట్టారు. అనంతరం రెండు వర్గాలకు చెందిన ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. గాయపడినవారిని వెంటనే చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని చెప్పారు. స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులు మాట్లాడుతూ దీనిపై పూర్తిగా దర్యాప్తు చేసి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

ఎర్ర స్మగ్లర్ల సరికొత్త దారి

- కొత్త పద్ధతులతో ఎర్రచందనం స్మగ్లింగ్
- అడ్వకేట్, ప్రెస్, పోలీస్ స్టిక్కర్లు కలిగిన కార్లలో రవాణా
- ప్రతి ఇరవై కిలోమీటర్లకో ఎస్కార్ట్ ఏజెంట్
- బండి వెళ్లగానే ఏజెంట్లకు ఆన్‌లైన్‌లో కానులు





దుంగలు తరలిస్తూ పట్టుబడిన ఆయిల్ ట్యాంకర్, నెల్లిపట్ల వద్ద స్మగ్లర్లు వదిలిపెట్టిన కారు (ఫైల్)

పలమనేరు: శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం దుంగలను తరలించేందుకు స్మగ్లర్లు ఎప్పటికప్పుడు సరికొత్త మార్గాలను ఎంచుకుంటున్నారు. రవాణా మార్గంలో లోకల్‌గా ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని వీరి సాయంతో అధికారుల కళ్లుగప్పి యథేచ్ఛగా దుంగలను కర్ణాటకలోకి తరలిస్తున్నారు. ఇటీవల పలమనేరు ప్రాంతంలో జరిగిన కొన్ని సంఘటనలు అధికారులకే షాకిచ్చాయి. ఇప్పటిదాకా రకరకాల వాహనాల్లో దుంగలను తరలించే అక్రమార్కులు ఇప్పుడు ఖరీదైన కార్లలో ఎవరికీ అనుమానం రాకుండా పని కానిచ్చేస్తున్నారు.

కొత్త పద్ధతుల్లో అక్రమరవాణా

ఇప్పటిదాకా అంబులెన్స్, పాలవ్యాను, కూరగాయల వాహనాల్లో దుంగలను తరలించారు. కానీ ఇప్పుడు ఖరీదైన కార్లలో సీట్లను తొలగించి ఎవరికీ అనుమానం రాకుండా అందులో దుంగలను తరలిస్తున్నారు. దారిమధ్యలో పెట్రోలు అయిపోయినా కారులోనే రెండు ఆయిల్ క్యాన్లను స్టాకు ఉంచుకొని వెళుతున్నారు. దీంతో కారు హైవేలలో సైతం పట్టపగలే ఎవరికి అనుమానం రాకుండా వెళ్లొచ్చనే ప్లాన్‌తో స్మగ్లర్లు ఈ మార్గాన్ని ఎంచుకొన్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా స్మగ్లింగ్‌కోసం వాడే కార్లకు ప్రెస్, పోలీస్, డాక్టర్, అడ్వకేట్ స్టిక్కర్లను సైతం అంటిస్తున్నారు.

గతంలో అనుమానం రాకుండా..

ఏమాత్రం అనుమానం రాకుండా టమాటా బాక్సులకింద దుంగలను తరలిస్తున్నారు. గతంలో పలమనేరు పట్టణానికి చెందిన టమాటాలారీలో ఎర్రదుంగలు తరలిస్తుండగా ఆత్మకూరు అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. విత్తన కోడిగుడ్లు(హ్యాచరీ ఎగ్స్)ను తరలించే పలు ఏసీ కంటైనర్లు, పార్సిల్ కొరియర్ వాహనాలు, ఆయిల్ ట్యాంకర్‌లో ఎర్రదుంగలను పెట్టి రవాణా చేస్తుండగా గతంలో పోలీసులు పట్టుకున్నారు. అంతేగాక ప్రైవేటు అంబులెన్స్‌లలో నకిలీ రోగిని ఉంచుకొని సైరన్ వేసుకొంటూ దుంగలను తరలించిన సంఘటనలు చోటు చేసుకున్నాయి.

అన్ని మార్గాల్లోనూ లోకల్ ఏజెంట్లు

ఇప్పటి వరకూ ఎవరిని నమ్మకుండా స్మగ్లింగ్ సాగేది. కానీ ఇప్పుడు స్మగ్లర్లు వారు వెళ్లే మార్గాల్లో ప్రతి ఇరవై కిలోమీటర్లకు ఓ స్థానిక ఏజెంట్‌ను ఎస్కార్ట్‌గా పెట్టుకున్నట్టు తెలుస్తోంది. వాహనం బయలుదేరగానే ఏజెంట్ తన పరిధిలో ఎలాంటి ఇబ్బంది లేకుండా వాహనాన్ని పాస్ చేయిస్తాడు. ఈ మొత్తం నెట్‌వర్క్ సెల్‌ఫోన్ల ద్వారానే సాగుతోంది. ఇటీవల వందలాది కిలోమీటర్లు ఛేజ్ చేసిన వాహనాన్ని దారి తప్పించడం వెనుక ఆయా ప్రాంతంలోని స్మగ్లర్ల ఏజెంట్లు కీలకంగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. వారి బీట్‌లో వాహనం పాసైన వెంటనే వారికి ఆన్‌లైన్ ద్వారా ఫోన్‌పే, జీపేకి స్మగ్లర్లకు సంబంధించిన మూడో వ్యక్తుల ద్వారా డబ్బులు జమ అవుతున్నట్టు సమాచారం. ఇటీవల స్థానిక హైవేలో జరిగిన స్మగ్లింగ్‌పై పలమనేరు ఎఫ్‌ఆర్వో శివన్న మాట్లాడుతూ, స్మగ్లర్లు హైవేలోనే కార్లలో వేగంగా వెళ్తూ ఎవరికీ అనుమానం రాకుండా దుంగలను తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. తాజాగా నెల్లిపట్ల వద్ద అడవిలో రోడ్డు లేకపోవడంతో స్మగ్లర్లు కారును వదిలిపెట్టి అడవిలోకి వెళ్లినట్టు పేర్కొన్నారు.

ఇవిగో సాక్ష్యాలు

- మూడురోజుల క్రితం కడప జిల్లాలోని శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం దుంగలతో కర్ణాటకకు బయలుదేరిన కారును తిరుపతి టాస్క్‌ఫోర్స్ అధికారులు వందల కిలోమీటర్లు వెంటాడారు. కడప జిల్లానుంచి తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన నెల్లిపట్ల వరకు వెళ్లారు. దుంగలతో ఉన్న కారును స్మగ్లర్లు దేవరకొండ వద్ద వదిలిపెట్టి పక్కనే ఉన్న అడవిలోకి వెళ్లి తప్పించుకున్నారు. వీరు ఒకే కారుకు నాలుగైదు నంబర్ ప్లేట్‌లను వినియోగించరు.
- ఇరవై రోజుల క్రితం ఓ కారులో ఎర్రచందనం దుంగలు బెంగళూరు హైవేమీదుగా తరలిపోతున్నట్లు టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. దీంతో వారు స్థానిక ఫారెస్ట్ అధికారులను అప్రమత్తం చేశారు. దీంతో ఇక్కడి ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది స్థానిక గాంధీనగర్ వద్ద ఆ కారును పట్టేందుకు కాపుకాశారు. అయితే దుంగలున్న కారు వాయువేగంతో వారిముందే దూసుకెళ్ళింది. వెంటనే అధికారులు రాష్ట్ర సరిహద్దుల్లోని నంగిలి టోల్‌గేట్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. కాని ఆ మార్గంలో కారు వెళ్లలేదు. పట్టణ సమీపంలోని బైపాస్‌రోడ్డులో ఓ ఇంటివద్ద స్మగ్లర్లు కారును విడిచిపెట్టారు. ఆపై అనుమానంగా కారుందనే విషయాన్ని వారే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చి తిన్నగా తప్పుకున్నారు. దీన్ని బట్టి చూస్తే రహదారులకు ఆనుకుని ఉన్న గృహాలు, పొలాలనున్న వారి సాయం సైతం తీసుకొని కార్లను వారి వద్ద దాచుతున్నట్టు అధికారులు గుర్తించారు.

కారుకు పది రకాల నంబర్లు

తాజాగా టాస్క్‌ఫోర్స్ అధికారులకు పట్టుబడిన కారులో పదిదాకా నంబర్ ప్లేట్లున్నాయి. తొలుత ఈ స్విఫ్ట్ కారు కడపజిల్లా సరిహద్దులో కనిపించిన నంబర్ ప్లేట్, ఆపై పీలేరు మార్గంలో ఇదే కారు మరో నంబర్‌ప్లేట్, ఆపై పుంగనూరునుంచి మరో నంబర్‌ప్లేట్‌తో వచ్చినట్టు తెలిసింది. దీంతో అధికారులు ముందస్తు సమాచారం ఇచ్చినా కారు నెంబరు వేరు కావడంతో కారును పట్టుకోకుండా స్మగ్లర్లు జాగ్రత్త పడినట్టు తెలుస్తోంది. ఇక్కడి రాష్ట్ర సరిహద్దు నుంచి కేఏ నంబర్ ప్లేట్‌ను వాడి కర్ణాటకలోకి వెళ్లేలా వీరి స్కెచ్ ఉన్నట్టు తెలుస్తోంది.



కారులో లభ్యమైన నంబర్ ప్లేట్లు

తీర ప్రాంతంలో చలిగాలులు

చిల్లకూరు : వాతావరణంలో మార్పుల కారణంగా రెండురోజుల నుంచి తీర ప్రాంతంలో చలిగాలులు వీస్తున్నాయి. సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. సముద్రం కసురు మీద ఉండడంతో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లడం లేదు. తీర ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

తుడా వెంచర్‌లో ఆక్రమణదారులు



మాట్లాడుతున్న తుడా వీసీ హరికృష్ణ

తిరుపతి తుడా : తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం గ్రామ పరిధిలో తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ(తుడా) విక్రయించిన ప్లాట్లకు సంబంధించిన కొనుగోలుదారులు అధైర్య పడాల్సిన అవసరం లేదని వీసీ హరికృష్ణ స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకే తుడా అభివృద్ధి చేసిన స్థలంలో లే ఔట్ వేసి ప్లాట్లు విక్రయించామని తెలిపారు. బాధితులకు పరిహారం చెల్లించి భూసేకరణ ప్రక్రియ ద్వారా భూములను స్వాధీనం చేసుకున్నామన్నారు. సోమవారం తుడా కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. వేదాంతపురం గ్రామ పరిధిలోని తుడా లేఔట్‌లో ఆదివారం కొందరు అక్రమంగా చొరబడటమే కాకుండా ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించారన్నారు. వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వేదాంతపురం సర్వే నంబర్196, 202, 203, 204లో 25.22 ఎకరాల భూమిని 1992లో ప్రభుత్వ నిబంధనల మేరకు భూ సేకరణ చేసినట్టు చెప్పారు. ఈ కేటాయింపును సవాల్ చేస్తూ గతంలో హైకోర్టులో సి.శంకర్ రెడ్డి, ఇ.పుల్లారెడ్డి ఇతరులు రిట్ పిటిషన్లు దాఖలు చేయగా, వాస్తవిక పరిస్థితుల ఆధారంగా కోర్టు పిటిషన్లను కొట్టివేసిందన్నారు. ఇలా పలుమార్లు పిటిషన్లు దాఖలు చేశారని, 2007లో సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయగా.. అక్కడ కూడా తుడాకు అనుకూలంగా అప్పీల్‌ను కొట్టివేసినట్లు వివరించారు. 2020లో శంకర్ రెడ్డి కొడుకు వంశీవర్ధన్ రెడ్డి రిట్ పిటిషన్ దాఖలు చేయగా సర్వే నంబర్ 203లో 0.50 సెంట్లు స్థలంలో జోక్యం చేసుకోవద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన కోర్టు, ఆ తరువాత 2023లో పిటిషన్ కొట్టివేసిందన్నారు. ఆ తరువాత కూడా కోర్టు అప్పీల్‌కు అవకాశం ఇచ్చినప్పటికీ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేదన్నారు. రెండు దశల్లో చేసిన భూ సేకరణ ప్రక్రియలో పరిహారాన్ని బాధితుల బ్యాంకు ఖాతాలలో జమ చేసినట్లు వివరించారు.

బకాయిలు చెల్లించాకే స్వాధీనం చేసుకోండి



నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ వద్ద నిరసనకు దిగిన చెరుకు రైతులు

నింద్ర: రైతులకు బకాయిలు చెల్లించాకే ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. మండలంలోని నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకోవడానికి ఫైనాన్స్ ప్రతినిధులు సోమవారం రావడంతో చెరుకు రైతులు వారిని అడ్డుకున్నారు. చెరుకు రైతులకు ఇవ్వవలసిన రూ.36 కోట్లు బకాయిలు తక్షణమే చెల్లించి, తరువాత ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకోవాలని తేల్చి చెప్పారు. రైతులు చెరుకు ఫ్యాక్టరీకి సరఫరా చేసి నాలుగేళ్లు గడుస్తున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదని జిల్లా రైతు సంఘం నాయకులు దాసరి జనార్దన్, ఆదినారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో తొమ్మిది మండలాలకు చెందిన నాలుగు వేల మంది రైతులు చెరుకు సరఫరా చేశారని గుర్తు చేశారు. వారికి ఇవ్వవలసిన బకాయిలు ఇవ్వకుండా కోర్టులో స్టే వేసి ఫైనాన్స్ కంపెనీ వారికి అప్పగించడం దారుణమన్నారు. రైతులకు బకాయిలు పూర్తిగా ఇప్పించిన తరువాతే ఫ్యాక్టరీని ఎవరికైనా ఇవ్వాలని, బకాయిలు ఇవ్వకుండా మాత్రం ఫ్యాక్టరీని ఎవరూ స్వాధీనం చేసుకోలేరని హెచ్చరించారు. ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు సోమవారం ఫ్యాక్టరీ వద్దకు రావడంతో రైతులు అడ్డుకుని గోబ్యాక్ అంటూ నిరసన కార్యక్రమం చేపట్టారు. నగరి రూరల్ సీఐ శ్రీనివాసంతి మాట్లాడుతూ రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. దీంతో ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు వెనుదిరిగి వెళ్లారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రఘునాథరెడ్డి, సుదర్శననాయుడు, రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై నిర్లక్ష్యం వద్దు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: స్పందనలో వచ్చే ప్రతీ ఒక్క ఫిర్యాదును విచారించాలని, ఈ విషయంలో అలసత్వం వద్దని ఎస్పీ రిశాంత్‌రెడ్డి హెచ్చరించారు. చిత్తూరులోని ఏఆర్ పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించారు. ఏఎస్పీ సుధాకర్, అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మీతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కుటుంబ, ఆస్తి తగాదాలు, భూ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, పోలీసు సేవలపై ప్రజలు ఏఎస్పీకి వినతులు ఇచ్చారు. వాటిని నిర్ణీత సమయంలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



సురేష్‌కుమార్ (ఫైల్)

ఏర్పేడు : మండలంలోని సీతారాంపేట వద్ద వేసిన ప్రైవేట్ వెంచర్‌లో ఆదివారం ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఈ మేరకు సీఐ శ్రీహరి వివరాలు వెల్లడించారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, దుత్తలూరు మండలం, బ్రహ్మేశ్వరం గ్రామానికి చెందిన సురేష్‌కుమార్(30) చెట్టుకు చీరతో ఉరివేసుకుని మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ట్రాక్టర్ కింద పడి బాలుడి మృతి

కలువాయి: మండలంలోని వెరుబొట్లపల్లె ఎస్సీ కాలనీలో సోమవారం సాయంత్రం ప్రమాదశాత్తు ట్రాక్టర్ కింద పడి తూమాటి ప్రవీణ్(6) మృతి చెందాడు. ప్రవీణ్ ఆడుకుంటూ ట్రాక్టర్ కిందకు వెళ్లాడు. గమనించని డ్రైవర్ ట్రాక్టర్‌ను ముందుకు కదిలించడంతో వెనుక చక్రం కింద పడి బాలుడు మరణించాడు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో తల్లిదండ్రులు లక్ష్మమ్మ, చిన్న దంపతులు కన్నీరుమున్నీరయ్యారు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

వరిపంటపై ఏనుగుల దాడి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పాతపేట పంచాయతీలో ఆదివారం రాత్రి వరి పంటపై ఏనుగులు దాడి చేశాయి. పంట చేతికొచ్చే సమయంలో ఏనుగులు ధ్వంసం చేయడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగులు ధ్వంసం చేసిన పంటను సోమవారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీదేవి పరిశీలించారు.

మిస్టరీగా యువకుడి హత్య కేసు



పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన యువకుడు (ఫైల్)

పుంగనూరు: విజయదశమి రోజు (అక్టోబర్ 23)న పట్టణంలోని నడిబొడ్డున ఉన్న ఆర్టీసీ బస్టాండులో వెలుగు చూసిన యువకుడి హత్య కేసు మిస్టరీగానే ఉంది. గుర్తు తెలియని యువకుడి(23)ని తాళ్లతో కట్టేసి హత్య చేశారు. సుమారు పది రోజులు కావస్తున్నా ఈ కేసు దర్యాప్తు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. సీఐ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, దర్యాప్తు చేపట్టారు. కానీ యువకుడికి సంబంధించి ఎలాంటి క్లూ లభించలేదు. హత్యకు గురైన యువకుడు రెండు రోజుల ముందే పోలీస్ స్టేషన్‌కు వచ్చి వెళ్లాడు. అయితే హతుడి వివరాలు తెలిస్తే కేసు ఛేదించడం సులభమవుతుంది. లేకపోతే ఈ హత్య కేసు మిస్టరీగా మారనుంది. అయితే పోలీసులు మాత్రం ఈ కేసును ఛేదించి నిందితులను పట్టుకుంటామని చెబుతున్నారు.

విద్యుదాఘాతానికి ఎద్దులు మృతి

కేవీబీపురం : మండలంలోని మఠం గ్రామంలో సోమవారం విద్యుదాఘాతానికి గురై రెండు ఎద్దులు మృతి చెందాయి. వివరాలు వెంకటేష్ అనే రైతు తన ఎద్దులను దున్నకానికి పొలంలోకి తోలాడు. ఈ క్రమంలో సమీపంలోని మోటారు తీగలు తగలడంతో ఎద్దులు కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాయి. ఎద్దుల విలువ సుమారు రూ.1.30 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. తమను ఆదుకోవాలని అధికారులను కోరాడు.

ప్రేమించాడు.. పెళ్లాడాడు.. చంపేశాడు!

- కిరాతకంగా నిండు గర్భిణి హత్య
- బత్తలవల్లంలో దారుణం



సంఘటన స్థలంలో స్థానికులను విచారిస్తున్న పోలీసులు

వరదయ్యపాళెం : పోస్టు గ్రాడ్యుయేషన్ చేసినా విచక్షణ మరిచాడు. ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యపై కనికరం వదిలేశాడు. గర్భిణి అనే దయాదాక్షిణ్యం కూడా లేకుండా దారుణంగా హతమార్చాడు. ఇద్దరు చిన్నారులకు తల్లిని దూరం చేశాడు ఓ కిరాతకుడు. కట్టుకున్న భార్యని పాశవికంగా కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ ఘటన వరదయ్యపాళెం మండలం బత్తలవల్లం దళితవాడలో సోమవారం ఉదయం జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన కాటయ్య సుమారు 8 ఏళ్ల క్రితం నాయుడుపేట సమీపంలోని పూనేపల్లెకు చెందిన పావనిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇద్దరూ వేర్వేరు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు చేసేవారు. వీరికి ఐదేళ్లలోపు కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే ఇటీవల ఇరువురూ ఉద్యోగాలు మానేసి ఇంట్లోనే ఉంటున్నారు. ఈ క్రమంలో తరచూ గొడవలు పడుతూ ఉండేవారు. తాజాగా సోమవారం ఉదయం 9 గంటల సమయంలో మళ్లీ ఘర్షణ పడడంతో కాటయ్య ఇంట్లోని కత్తి తీసుకుని పావని(30)పై దాడి చేశాడు. గొంతులో పొడిచి, తలపై మోదడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. అయితే హత్యతో తనకు ఎలాంటి సంబంధం లేదని కాటయ్య బుకాయించేందుకు యత్నించినా అక్కడే ఉన్న మృతురాలి కుమార్తె అసలు విషయం చెప్పేసింది. తండ్రే తమ తల్లిని చంపేశాడని వెల్లడించింది. దీనిపై సమాచారం అందుకున్న సీఐ శివకుమార్‌రెడ్డి, ఎస్ఐ నాగార్జునరెడ్డి, ఏఎస్ షణ్ముగం తమ సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. హత్యాస్థలాన్ని పరిశీలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. హత్యాయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాటయ్య తల్లిదండ్రులను సైతం అదుపులోకి తీసుకుని విచారించారు. మృతదేహాన్ని సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్‌టీమ్ ద్వారా ఘటనాస్థలంలో ఆధారాలు సేకరించారు.

ఉలిక్కిపడిన గ్రామం

హత్య విషయం తెలియగానే బత్తలవల్లం గ్రామం ఉలిక్కిపడింది. ప్రశాంతమైన పల్లెలో దారుణం జరగడంపై స్థానికులు ఆందోళన చెందారు. నిందితుడు కాటయ్య మానసిక పరిస్థితిపై అనుమానం వ్యక్తం చేశారు. ఉద్యోగం మానేసినప్పటి నుంచి అదోలా ఉండేవాడని చెబుతున్నారు. పావని గర్భం దాల్చడంతో కంపెనీకి వెళ్లకుండా ఇంటికే పరిమితమైందని, అప్పటి నుంచి ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో కాటయ్య గ్రామంలో ఎవరితో మాట్లాడేవాడు కాదని వెల్లడిస్తున్నారు.



హత్యకు గురైన పావని



పావని (ఫైల్)



నిందితుడు కాటయ్య